ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -4 పేజీలు - 08 వెల - 04/- బుధవారం10 డిసెంబర్ 2025

# రిజిస్ట్రేషన్ కాగానే ఆటో మ్యుటేషన్.

## రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

**రెవెన్యూ సేవలను మరింత సులభతరం**


**రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు**

**2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి**

**రెవెన్యూ అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు**

**పాస్‌పోర్ట్ తరహా కార్యాలయాలను ఏర్పాటు చేస్తామన్న మంత్రి**

అమరావతి,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:** రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని ఆ శాఖ ఉన్నతాధి కారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు ఆటో మ్యుటేషన్ జరగాలని ఆయన పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలని ఆయన ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఈ సందర్భంగా వారికి సూచించారు. రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని వారికి తెలిపారు. ప్రతి నెలా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహిస్తానని వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.**మిగతాది 2లో...**



# భారత్‌లో రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి

**మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల ప్రకటన**

**ప్రధాని మోడీతో భేటీలో పలు అంశాలపై చర్చ**

**స్వాగతించిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిన ఇండియాలో పెడుతున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది భారతదేశ ఆశయాలకు మద్దతు ఇస్తుందని చెప్పారు. భారతదేశ ఎఐ ఫస్ట్ ఫ్యూచర్' నిర్మించేందుకు, డెవలప్ చేసేందుకు $17.5 బిలియన్లు అంటే రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. భారతదేశం ఎఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు సత్యానాదెళ్ల ప్రధాని నరేంద్రమోడీకి థాంక్స్ చెప్పారు. **2లో...**



# ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత

**ఇండిగోకు కేంద్రం గట్టి షాక్**

**పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు**

**ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సిఇవో**

న్యూఢిల్లీ,**డడిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగోకు కేంద్రం గట్టి షాక్ ఇచ్చింది. ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత విధిస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. తద్వారా విమాన సేవలను స్థిరీకరించడం సాధ్యమవు తుందన్నారు**మిగతాది 2లో...**





## మంగళగిరిలో 'మాటామంతీ'

**పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ భేటీ**

**అవినీతి రహిత పాలనపై ఉద్యోగులకు దిశానిర్దేశం**

**గ్రామీణ సేవల మెరుగుకు సలహాలు స్వీకరించనున్న పవన్**

## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**: లోక్‌సభలో రాహుల్ గాంధీ**

**ఈసీని బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్న రాహుల్**

**ఓట్ల చోరీపై ఆధారాలు ఇచ్చినా ఈసీ స్పందించలేదని ఆరోపణ**

**దేశంలోని వ్యవస్థలను ఆర్ఎస్ఎస్ కబ్జా చేస్తోందని వ్యాఖ్య**

న్యూఢిల్లీ,డిసెంబర్: 9:
ఎన్నికల కమిషన్ (ఈసీ)ను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర



# రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం

## రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు

**సిఎం రేవంత్ సమక్షంలో పలు కంపెనీల ఒప్పందాలు**

హైదరాబాద్,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ గ్లోబల్ సమిట్ రెండో రోజు భారీ పెట్టుబడులు సమకూరాయి. వివిధ కంపెనీలు తమ పెట్టుబడులను ప్రకటించాయి. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో పలు ఒప్పందాలు సాగాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశమయ్యారు.**మిగతాది 2లో...**





## తిరుమల పరకామణి చోరీ కేసు హైకోర్టుకు మరో నివేదిక సమర్పించిన సీఐడీ

అమరావతి,,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మరో నివేదికను హైకోర్టుకు సీఐడీ సమర్పించింది. తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంపై సీఐడీ అదనపు నివేదికను వేసింది.**మిగతాది 2లో...**

## సినీ పరిశ్రమలకు అండదండలు

**అన్ని రకాల సౌకర్యాల కల్పనకు సిద్ధం**

**సినీ ప్రముఖులతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినీ పరిశ్రమని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని టాలీవుడ్ ప్రముఖులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి **మిగతాది 2లో...**

## స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్...

**కట్టడికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

**రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

**అధ్యయనం కోసం జాతీయ స్థాయి నిపుణులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సీఎం ఆదేశం**

అమరావతి**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
రాష్ట్రంలో ఆందోళన కలిగిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణకు, దానిపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.**మిగతాది 2లో...**



## అమెరికాలో బిజీగా మంత్రి లోకేశ్

**పెట్టుబలు కోసం పలు సంస్థలతో భేటీ**

అమరావతి**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**అమెరికాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన వరుస భేటీలు నిర్వహించారు. ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మతో సమావేశ మయ్యారు**మిగతాది 2లో...**



# భారత్‌లో రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ అతిపెద్ద పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. మోడీతో మీటింగ్ గురించి నాదెళ్ల ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారతదేశ ఏఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు, దేశ ఆశయాలకు మద్దతు ఇవ్వడానికి, ఇండియా ఏఐ ఫస్ట్ ఫ్యూచర్‌కు అవసరమైన మౌలికసదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను నిర్మించడంలో సహాయపడటానికి జాశ్రీ17.5 బిలియన్ల పెట్టుబడి నిబద్ధతకు కట్టుబడి ఉన్నామని అన్నారు.గూగుల్, అమెజాన్ కూడా భారత్‌లో డేటా సెంటర్లు, ఏఐ హబ్‌ల ఏర్పాటులో బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించాయి. అక్టోబర్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నంలో ఏఐ హబ్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికను వెల్లడించారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 17.5 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో మంగళవారం భేటీ అయిన ఆయన.. ఈ పెట్టుబడి గురించి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. భారత్‌లో ఏఐ అవకాశాలపై స్ఫూర్తిదాయక సంభాషణ తమ మధ్య జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీతో ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేశారు. దేశ ఏఐ ఆశయాలకు మద్దతుగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టనున్నట్లు సత్యానాదెళ్ల ప్రకటించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. భారత్‌లో కృత్రిమ మేధ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను అందించేందుకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు. రాబోయే నాలుగేళ్లలో (2026–29)
మధ్య ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్లకు ఈ పెట్టుబడి అదనమని తెలిపింది. మైక్రోసాఫ్ట్ పెట్టుబడి ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏఐ విషయంలో భారత్ పట్ల ప్రపంచం ఆశావాదంతో ఉందన్నారు. సత్యానాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగిందని తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా భారత్‌ను ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ యువత ఈ గొప్ప అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందని, ఏఐ ఆపారశక్తిని సృజనాత్మకంగా ఉపయోగించుకుంటుందని ఆకాంక్షించారు.

# ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత

(మొదటి పేజీ తరువాయి)

ఇండిగో సేవలపై వివరణ కోరేందుకు సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు మంగళవారం పౌరవిమానయాన శాఖ సమన్లు జారీ చేసింది. ఈ భేటీ అనంతరం మంత్రి తన నిర్ణయం ప్రకటించారు. ఇండిగో అంతర్గత నిర్వహణలో వైఫల్యం, విమాన షెడ్యూళ్లు, కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్ల చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈలోగా సంస్థ కార్యకలాపాలను సమీక్షించేందుకు మరోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు నాయుడు తెలిపారు. డిసెంబర్ 6 వరకు ప్రభావితమైన విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు నూరు శాతం రిఫండ్లు పూర్తి చేసినట్లు ఇండిగో సీఈఓ మంత్రికి వివరించగా.. మిగిలిన మొత్తాలను కూడా త్వరగా వాపస్ చేయాలని ఆదేశించారు. ఇండిగో సేవల్లో ఈ పరిస్థితి తలెత్తకుండా అన్ని మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయానికొచ్చినట్లు మంత్రి తెలిపారు. మునుపటిలానే అన్ని గమ్యస్థానాలను కవర్ చేయాలని విమానయాన సంస్థను ఆదేశించారు. ఛార్జీలపై పరిమితి, ప్రయాణికుల సౌకర్యానికి సంబంధించి మంత్రిత్వశాఖ ఇచ్చిన అన్ని ఆదేశాలను పాటించాలని ఆదేశించారు.ఇదిలావుంటే ఇండిగో సంస్థ తాజా పరిస్థితుల నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకుందని ఆ సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఇండిగో సంస్థలో తలెత్తిన ఇబ్బందుల వల్ల.. అత్యవసర పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వేల మంది ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ విషయమై క్షమాపణలు కోరారు సీఈఓ. ఇండిగో విమాన సర్వీసుల్లోఇకపై ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని పీటర్ హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇండిగో విమానయాన సిబ్బంది అంతా తీవ్రంగా శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు.

## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు. మంగళవారం లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని, పక్షపాతంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.
చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) తప్పు చేసినా శిక్ష పడకుండా చట్టాలను మార్చారని రాహుల్ విమర్శించారు. ఓట్ల దొంగతనంపై తాము ఎన్నో ఆధారాలు సమర్పించినా ఈసీ నుంచి కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. బీజేపీకి అనుకూలంగానే ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటిస్తున్నారని, పోలింగ్ ముగిసిన 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకని ఆయన ప్రశ్నించారు. హర్యానా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్‌కు 23 ఓట్లు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఓటర్ల జాబితాలను ఎలా తారుమారు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు.
ఈ సందరరేగా కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు సంధించారు.

# సినీ పరిశ్రమలకు అండదండలు

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా వారికి సీఎం వివరించారు. 24 క్రాఫ్ట్స్‌లో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని వారికి సీఎం రేవంత్ సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ వివరించారు. సీఎం రేవంత్‌తో సమావేశమైన వారిలో చిరంజీవి, అజయ్ దేవగన్ అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటులు జెనీలియా, అక్కినేని అమలతోపాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు ఉన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నేటితో అంటే.. మంగళవారంతో ముగియనుంది.

# అమెరికాలో బిజీగా మంత్రి లోకేశ్

అమరావతిలో డిజైన్ / ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో డెస్క్ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో యూఎస్ పెట్టుబడులకు సహకారం అందించాలన్నారు. శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డితో సమావేశమై.. ఏపీలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరితోనూ మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌తో సమావేశమై.. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. రిగెట్టి కంప్యూటింగ్ సీటీవో డేవిడ్ రివాస్‌తో భేటీ అయ్యారు. ఏపీలో ఎలక్ట్రోలైజర్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### తిరుమల పరకామణి చోరీ కేసు

# హైకోర్టుకు మరో నివేదిక సమర్పించిన సీఐడీ

(మొదటి పేజీ తరువాయి)

అదనపు నివేదికను మరో రెండు సెట్లను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధతను తేల్చేందుకు విచారణ జరుపుతున్న సీజే నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలన నిమిత్తం నివేదికలు వారి ముందు ఉంచాలని రిజిస్ట్రీకి న్యాయస్థానం స్పష్టీకరించింది. అదనపు నివేదికను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు తదుపరి విచారణను బుధవారం నాటికి హైకోర్టు వాయిదా వేసింది.కాగా.. అంతకు ముందే పరకామణి చోరీ కేసు రాజీ వ్యవహారం, రవికుమార్ ఆస్తులపై నివేదికలను సీఐడీ అధికారులు సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసిన విషయం తెలిసిందే. సీఐడీ నివేదికను తమకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. కాగా.. 2023 ఏప్రిల్ 29న పరకామణి విధుల్లో రవికుమార్ అమెరికన్ డాలర్లను అపహరిస్తూ దొరికిపోయాడు. అయితే తొలిసారి దొంగతనం చేశానంటూ రవికుమార్?తో క్షమాపణ చెప్పించి ప్రభుత్వ లెక్కల ప్రకారం అప్పట్లో 14 కోట్ల 43 లక్షల విలువైన రవికుమార్ ఆస్తులను టీటీడీకి గిఫ్ట్ డీడ్?గా ఇచ్చేలా చేశారు. 2023 జూన్ 19న ఆ మేరకు తీర్మానం చేయడం ఆ తర్వాత 3 నెలలకే కేసును రాజీ కుదర్చడం వెనుక ఉన్న మతలబుపై విచారణ జరిపిన సీఐడీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది.

# రిజిస్ట్రేషన్ కాగానే ఆటోమ్యుటేషన్...

రాష్ట్రంలో జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తం అయ్యేలా వ్యవస్థను రూపొందిస్తు న్నామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత పాలకులు చేసిన పాపాల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగు తున్నాయని మండిపడ్డారు. ఏడాదిన్నరగా వైసీపీ ప్రభుత్వ పాపాలు కడిగేందుకు కృషి చేస్తున్నందు వల్లే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దోచుకునేందుకు గత పాలకులు అస్తవ్యస్తం చేసిన విధానాలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశామని వివరించారు. అవినీతి,అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. జాయింట్ కలెక్టర్లు లేని జిల్లాలకు వెంటనే వారిని నియమించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పని చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. భూ సమస్యలన్నింటికీ ఇకపై జాయింట్ కలెక్టర్లదే బాధ్యత అని మంత్రి అనగాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'జీరో ఎర్రర్ రెవన్యూ వ్యవస్థ' ఏర్పాటు దిశగా ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సచివాలయంలో రెవెన్యూశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి.. కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఈ ఏడాది రూ.10,169 కోట్ల ఆదాయం ఆర్జించడమే లక్ష్యమని సీఎం చెప్పారని మంత్రి తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్టు కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం ఆదేశించారన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా.. అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తమయ్యే వ్యవస్థ తీసుకొస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగుతు న్నాయని విమర్శించారు. ' గత పాలకులు చేసిన అస్తవ్యస్తవిధానాలు ఇప్పుడిప్పుడే ఓ కొలిక్కి వస్తున్నాయి. మొత్తం 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశాం. జేసీలు లేని జిల్లాలకు వెంటనే జేసీలను నియమించాలని సీఎం ఆదేశించారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. భూ సమస్యలన్నింటికీ ఇక జేసీలదే బాధ్యత చెప్పారు' అని అనగాని వెల్లడించారు. 22ఏ, ఫ్రీ హోల్డ్ సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నామని అనగాని పేర్కొన్నారు. భూ వివాద రహిత ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ప్రతి బుధవారం కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై గురువారం మంత్రి వర్గ ఉపసంఘం భేటీకానున్నట్లు తెలిపారు.

# మంగళగిరిలో 'మాటామంతీ'

### పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ భేటీ

**అవినీతి రహిత పాలనపై ఉద్యోగులకు దిశానిర్దేశం**

**గ్రామీణ సేవల మెరుగుకు సలహాలు స్వీకరించనున్న పవన్**

అమరావతి**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
ఏపీ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్యోగులతో నేరుగా చర్చించేందుకు సిద్ధమయ్యారు.నేడు (బుధవారం) మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ (పీఆర్), గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖల ఉద్యోగులతో 'మాటామంతీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలో అవినీతికి తావులేని, పారదర్శకమైన పాలన అందించేందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఈ సమావేశంలో ఆయన కోరనున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖలో సుమారు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రామీణాభివృద్ధి శాఖలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం పదోన్నతులు, వేతనాల పెంపుతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నూతన సంవత్సర కానుకగా సంక్రాంతి నాటికి ఈ ప్రయోజనాలను వారికి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న ఈ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ భేటీలో అన్ని కేడర్ల ఉద్యోగులతో పవన్ స్వయంగా మాట్లాడి, గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎలాంటి విధానాలు అవలంబించాలనే దానిపై వారి అభిప్రాయాలు, సలహాలు తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్...

అపరిశుభ్రతే అనేక వ్యాధులకు మూలకారణమని, ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత చైతన్యం తీసుకురావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రతపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని, అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ వ్యాధి కారణంగానే మరణాలు సంభవించినట్లు ఇప్పటివరకు ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనుమానిత మరణాలుగా నమోదైన 9 కేసులను పరిశీలించగా, ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగానే వారు మరణించినట్లు తేలిందని వివరించారు. స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేసుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉందని, తమిళనాడు, ఒడిశాలలో ఏకంగా 7 వేలకు పైగా కేసులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.ఈ నివేదికపై స్పందించిన ముఖ్యమంత్రి, స్క్రబ్ టైఫస్‌ను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. తక్షణమే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను విశ్లేషించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా పటిష్ఠమైన కార్యాచరణ అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కారణాలతో మొత్తం సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గాయని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు 56 శాతం, చికున్‌గున్యా 46.5 శాతం, మలేరియా 11 శాతం మేర తగ్గాయని వివరించారు. పరిశుభ్రతను పెంచడం ద్వారా సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతేనని, దానిపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు. పాలు, ఎఫ్ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి కనబరిచింది. మరోవైపు సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.రాష్ట్రం రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంవో) నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో ఫెర్టిస్ ఇండియా రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మరోవైపు ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్–2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఫ్రీజ్– డ్రైడ్ కాఫీ ఎ÷–లాంట్ నిర్మాణానికి వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ ఒప్పందం కుదుర్చుంది. ఫుడ్ అండ్ ఎఫ్ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల విస్తరణకు క్రైన్స్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రూ.9 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు జేసీకే ఇన్‌ఫ్రా, మూడు దశల్లో రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా, 50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్వెలోన్ నెక్సస్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఏజీపీ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఏఐ–రెడీ డేటా పార్క్ ప్రకటించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో ఫార్మా,
పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యుల్స్ ఇండియా పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు.. రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది.. బ్యాక్‌టు బ్యాక్ మీటింగ్‌లు, వరుసగా మౌ సంతకాలతో రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి పలు కంపెనీలతో చర్చలు జరిపారు. రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రావడం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం కానుంది. ఈ పెట్టుబడులతో కొత్త సంస్థలు.. భారీ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా రాబోతున్నాయి.. అయితే, పెట్టుబడుల సంఖ్య మరింత పెరగనుంది..

# భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

న్యూక్లియస్ (కేంద్రం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు. 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని మెట్రో రైలుతో అనుసంధానిస్తాం. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం అన్నారు. జోన్లవారీగా విభజించి ప్రతి జోన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దుతాం. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయి. ఫ్యూచర్ సిటీలో వర్సిటీల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. జూపార్క్ ఏర్పాటుకు వంతారాతో ఇప్పటికే ఒప్పందం జరిగింది. 400
ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుందని శ్రీధర్‌బాబు వివరించారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచ స్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. అద్భుతమైన మౌలిక వసతులతో ఏర్పాటయ్యే ఈ నగరాన్ని 13,500 ఎకరాలలలో జీరో కార్బన్ సిటీగా రూపొందించనున్నట్లు తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణా' అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను మంగవారం నాడు ఆయన గ్లోబల్ సమ్మిట్ లో వివరించారు. భవిష్యత్ నగరాన్నిఆరు అర్బన్ జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ ఏర్పాటయ్యే వివిధ పరిశోధన సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫాక్చరింగ్, ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ల ద్వారా మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. 9 లక్షల జనాభా కోసం నివాస గృహాల సముదాయాలు ఏర్పాటు చేస్తాం. నిర్మాణరంగంలో ఉన్నవారు వీటిని అభివృద్ధి చేస్తారు. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిస్తున్నాం. వచ్చే ఫిబ్రవరి చివరలో ఇక్కడ నిర్మాణాలు మొదలవుతాయి.ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ (డిస్ట్రిక్ట్ ) లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్ వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అడ్వెంచర్ కేంద్రాలు, స్టార్ హోటళ్లు నిర్మిస్తాం. ఫ్యూచర్ సిటీ అంతా ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలుస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ జీరో కార్బన్ సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరంగా భాసిల్లుతుంది. ఇక్కడ కురిసే ప్రతి వర్షం చుక్క ఇక్కడే ఇంకిపోయేలా రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతుంది. భూగర్భ జలాలకు కొదవ లేకుండా చేస్తాం. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో నూతన పరిశోధనలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉంటాయని అన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ.

**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 09:**
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని సచివాలయం-1 వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరుశాతం, వంటగది, పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న మెనూను ఆమె పరిశీలించారు. విద్యాబోధనపై పలు అంశాలను చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత పాల్గొన్నారు.

## కూరగాయల ధరల నియంత్రణకు సమన్వయ చర్యలు.

### జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** నంద్యాల జిల్లా లో కూరగాయల ధరలను నియంత్రించి వినియోగదారులకు న్యాయమైన ధరలు అందించేందుకు అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ సూచించారు.
మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వెజిటబుల్ ప్రైస్ మానిటరింగ్ సమావేశంలో రైతులు, హోల్సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, హార్టికల్చర్ అధికారులు, రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ.. కూరగాయల సరఫరా మరియు డిమాండ్‌ను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, ధరలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు నష్టం లేకుండా, వినియోగదారులపై భారం పడకుండా ధరల నియంత్రణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో కూరగాయల ధరల్లో తేడాలు, సరఫరా వ్యవస్థ, రైతు బజార్ల నిర్వహణపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ ప్రసాద్. జాకీర్ తో పాటు సంబంధిత అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** మంగళవారం నాడు నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు తో కలిసి ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు జె .వి.సి. ఆగ్రో కెమికల్స్ నందు స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్వాయిస్ లు మరియు పలు ధ్రువపత్రాలు తనిఖీ చేయడం జరిగింది. అలాగే యూరియా మరియు డి. ఏ.పి భౌతిక నిలువలు మరియు ఈ పాస్ మిషన్ లలో వున్న స్టాక్ వివరాలను సరి చూడడము జరిగినది. అలాగే వారికి వచ్చిన ఎరువుల స్టాక్ లను మరియు వారు రిటైల్ డీలర్లకు వేసిన బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ దుకాణం యందు స్టాక్ రిజిస్టర్ మరియు భౌతిక నిలువలు సమంగా ఉండేలా చూసుకోవాలని, ప్రతి ఎరువుల మరియు పురుగు మందుల యాజమానులు ప్రభుత్వం నుండి అనుమతులు వున్న ఎరువులు మరియు పురుగు మందులు మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డ్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలని, ఎరువులు మరియు పురుగు మందులు కొన్న ప్రతి రైతు కి బిల్లు కచ్చితంగా ఇవ్వాలని తెలియజేశారు. ప్రతి ఎరువుల ధుఖాన యాజమానులు తప్పని సరిగా ఐఎఫ్ఎమ్ఎస్ మెషీన్ ద్వారా బిల్లులు చెయ్యాలని, అలాగే ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి గరిష్ట చిల్లర ధర కన్నా ఎవరైనా ఎక్కువగా అమ్మితే వారిపై ఎఫ్ సి ఓ 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## పోటీలలో గెలుపు పొందిన వారికి బహుమతుల ప్రధానం.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం డిసెంబర్ 09:** స్వామి వివేకానంద జయంతి సర్టిఫికెట్ లు అందజేసిన ఇంచార్జి ప్రిన్సిపాల్ సయ్యద్ బాబు. పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి గత నెలలో సెట్కూర్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వామి వివేకానంద జయంతి ప్రోగ్రామ్ నంద్యాల జిల్లా పీజీ కళాశాల లో జరిగిన జానపద, నృత్యం, మరియూ వ్యాసరచన పోటీలో పాల్గొని విజయం సాధించారు. ప్రిన్సిపాల్ సయ్యద్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులు ఇలాగే గొప్ప గొప్ప కార్యక్రమం లు పాల్గొన్నాని కళాశాల కు తల్లిదండ్రులు కు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు విద్యార్థులకు ప్రసంసా పత్రాలు ఇంచార్జి ప్రిన్సిపాల్ సయ్యద్ బాబు అందజేశారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు రమేష్ కుమార్ నాగేంద్ర, నాగమురళిమోహన్, దాక్షమని, నర్జహను, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:**
కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రవిటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య అని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.
మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నేపథ్యంలో పీపీపీ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ పీపీ నాగిరెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, రామలింగారెడ్డి, సాయినాథరెడ్డి, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ డా. శశికళారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తమ రెడ్డి, నంద్యాల జిల్లా జనరల్ సెక్రటరీ దేవనగర్ బాష, కౌన్సిలర్ సమ్మద్ డిమాండ్ చేశారు.
ఈ సందరరేగా వైసీపీ నేతలు మాట్లాడుతూ.... రేపు 10గంటలకు వైసీపీ జిల్లా కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పత్రాలను స్వీకరించడం జరుగుతుందని, అక్కడ నుండి కేంద్ర కార్యాలయానికి ఈనెల 15వ తేది కోటి సంతకాల సేకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందని, వాటిని నేతలు కేంద్ర కార్యాలయానికి చేర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. 17వ తేది మాజీ ముఖ్యమంత్రి వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ నేతలతో కలిసి రాష్ట్ర గవర్నర్కు కోటి సంతకాల సేకరణ పత్రాలను అందజేసి మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని ప్రజల తరుపున వచ్చిన వ్యతిరేకతను తెలియజేయడం జరుగుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని తమ సంపూర? మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్యలన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడం జరిగిందని తెలిపారు. అనుకున్న దానికంటే ఇప్పటికే కోటి 20లక్షల సంతకాలను ప్రజలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రైవేటీకరణను రద్దు చేయాలని ప్రజలు తమ సంతకాల ద్వార ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని నిరసించారని తెలిపారు. కోటి సంతకాల సేకరణకు ప్రజలు పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంపూర? మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన తీవ్ర వ్యతికేతను గమనించైనా కూటమి ప్రభుత్వం కళుతెరవాలని, పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో వైద్యవిద్య అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. మెడికల్ కళాశాలలను పీపీపీ విధానం చేయడం ఎంతో అసంబద్ధమైన విషయం అన్నారు. ఖచ్చితంగా ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సిందిగా వారు కోరారు.

# సింగిల్ డెస్క్ దరఖాస్తులను గడువులో పూర్తి చేయాలి.

### పెండింగ్‌లో ఉన్న 52 దరఖాస్తులను వేగంగా పరిష్కరించండి.

### పిఎంఈజిపి లక్ష్యాలను అధిగమించాలి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబరు 09:**
సింగిల్ డెస్క్ ద్వారా అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను గడువులోపే పరిష్కరించి, నూతన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కానారేన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, ఎల్డిఎమ్ రవీంద్ర కుమార్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను అవసరమైన అన్ని పత్రాలు అర్జీదారుల నుంచే తెప్పించుకొని, తిరిగి పంపకుండా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఆర్. క ృషా?పురంలోని హస్తకళల స్టోన్ మర్చెంట్లను మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివ ృద్ధి కోసం 4 కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉందని, వాటికి తగిన స్థలాలను గుర్తించి సంబంధిత యాజమాన్యాలతో చర్చించి, వివరాలను ఇన్వెస్ట్మెంట్ ట్రాకర్‌లో అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. పీఎంఈజీపి కింద కేటాయించిన 137 లక్ష్యాల్లో కేవలం 59 మాత్రమే పూర్తి అయినందున, మిగిలిన వాటిని ప్రాధాన్యంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన వారికి బ్యాంకులు ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలి అని బ్యాంకర్లను కోరారు. గత త్రైమాసికంలో మొత్తం 1,025 పరిశ్రమల దరఖాస్తులు అందగా, వాటిలో 973 దరఖాస్తులకు అనుమతులు మంజూరు అయ్యాయని, ఇంకా 52 దరఖాస్తులు వివిధ శాఖల్లో పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీలు తదితర శాఖలు గడువులోపే అనుమతి ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కింద పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీ సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి పథకాల ద్వారా జిల్లాలో 9 యూనిట్లకు రూ. 35.41 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి**
జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో నిరీ?త లక్ష్యాలను అధిగమించి జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, యువతి-యువకుల నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.

# జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్.

### సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తి యాప్ లపై అవగాహన కార్యక్రమాలు.

### అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా.

### స్కూల్లు/కాలేజీలు వద్ద, అనుమానాస్పద ప్రదేశాలలో పట్టణ శివారు ప్రాంతాల్లో ఆధునిక పరిజ్ఞానంతో నిఘా కట్టుదిట్టం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 09:**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా స్కూళ్లు కాలేజీలు, అనుమానాస్పద ప్రాంతాలు, పట్టణ శివారు కేంద్రాలలో, నేరాలు జరుగుటకు అవకాశం ఉన్న ప్రాంతాలలో పోలీసుల కదలికలు సస్పష్టంగా కనిపించేలా మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో నిఘా చేపట్టేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించవచ్చునని లక్ష్యంతో ఈ విజిబుల్ పోల్ సింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ద్వారాపోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలు సైబర్ సైబర్ నేరాలు చిన్నారులపై జరిగే అఘాయిత్యాలు, ఈవ్ టీజింగ్, శక్తి యాప్ మొదలగు వాటిపై పోలీసు అధికారులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచిస్తున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా మోటర్ వెహికల్ యాక్ట్ ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం జరుగుతుంది.
విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# జనవరి మూడో వారంలో స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రారంభం.

**యువత నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా కోర్సులు రూపొందించండి.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబరు 09:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ను జనవరి మూడో వారంలో ప్రారంభించే చర్యలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కానారేన్స్ హాల్లో నిర్వహించిన (జిల్లా స్థాయి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సలహా కమిటీ) సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ నరసింహారావు, ఎల్డిఎమ్ రవీంద్ర కుమార్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న యువతకు మెరుగైన నైపుణ్య మెళకువలు అందించడానికి యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు చదివిన యువతకు ఉచిత శిక్షణ, ప్రతి బ్యాచ్‌లో 60 మంది అభ్యర్థులకు వసతి, భోజనం సహా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారు స్వయం ఉపాధి సాధించేలా కోర్సులను రూపొందించాలని బ్యాంకు అధికారులను ఆమె సూచించారు. జిల్లా ప్రత్యేకతలకు అనుగుణంగా కోర్సులు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేస్తూ తిరుపతి, మహానంది వంటి దేవస్థానాల్లో వాడే పూలతో అగరబత్తుల తయారీ, అరటి నార, గుర్రపుడెక్కతో చీర తయారీ వంటి వాటిల్లో శిక్షలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక ప్రాంతాలు అధికంగా ఉన్నందున పర్యాటక రంగానికి అనుసంధానమైన శిక్షణలు, సోలార్ ఫలకాలు అమరిక, డ్రోన్ మరమ్మత్తు శిక్షణ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని ఆమె సూచించారు. జిల్లాలో యువత స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగేందుకు ఆర్ఎస్ఈటిఐ ఒక కీలక వేదికగా నిలవాలని కలెక్టర్ సూచించారు.

# పిఎం సూర్య ఘర్ పథకంలో పురోగతి పెంచాలి.

**-వెండర్ ఎంపిక పూర్తైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.**

**బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందించాలి. - జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబరు 09:** ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో నంద్యాల జిల్లాలో అంచనా మేరకు పురోగతి సాధించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కానారేన్స్ హాలులో డిఈలు, ఈఈలతో పీఎం సూర్యఘర్ పథకంపై వీడియో కానారేన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీ సుధాకర్, ఎల్డిఎం శ్రీ రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాబోయే కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై ప్రత్యేకంగా సమీక్ష చేసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో లక్ష్యానికి అనుగుణంగా పురోగతి సాధించాలన్నారు. వెండర్ ఎంపిక (కమిషన్) పూర్తయిన దరఖాస్తులను ఆగకుండా వెంటనే పూర్తి చేసి, లబ్ధిదారులు ప్రయోజనం పొందేలా చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. తక్కువ శాతం పురోగతి కనబరుస్తున్న నంద్యాల, రుద్రవరం, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, ఔకు, సంజామల, బనగానపల్లె (రూరల్), ఆత్మకూరు (రూరల్), శ్రీశైలం, ప్యాపిలి మండలాల్లో ప్రత్యేక ద ృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మండలాల్లో శనివారం నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆమె ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన రుణ సహాయం బ్యాంకుల ద్వారా సులభంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, బ్యాంకింగ్ వ్యవస్థ పథకం అమలులో పూర్తిగా సహకరించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యాలను అధిగమించేలా విద్యుత్ శాఖ అధికారులు క ృషి చేయాలన్నారు.

# గిరిజనులపై కూటమి ప్రభుత్వం కుట్ర.

**ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** వెనుకబడిన వర్గాల గిరిజనులకు ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇతర కులాలను ఎస్టీ జాబితాలో పార్లమెంట్ సాక్షిగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్లో ప్రస్తావించడం సరైంది కాదని, అణగారిన వర్గాల బతుకులతో ఆడుకోవడం సరికాదని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రటరీ విక్రమ్ సింహ నాయక్ లు పేర్కొన్నారు.మంగళవారం వెలుగోడు మండలంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న గిరిజనులపై మరో వ్యక్తులను తీసుకొచ్చి ఏకంగా పార్లమెంట్ సమావేశంలో నంద్యాల ఎంపీ ప్రస్తావించడం వల్ల గిరిజనుల గొంతు కోసిన వారవుతారన్నారు. ఎస్టిలో ఇతరులను చేర్చితే రాజకీయ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులు వారి చేతిలో చితికిపోవడం ఖాయమన్నారు. మరో మారు బ్రిటిష్ పాలనాల అణగారిన వర్గాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నారన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలు, కులవృత్తుల, వేష భాష, కలిగిన గిరిజనులలో ఇతర కులాలను చేర్చడం సరికాదన్నారు.అందరూ కలిసికట్టుగా సంఘటితమై ఉద్యమానికి నడుంబించాలన్నారు. త్వరలో నంద్యాలలో జరిగే భారీ ర్యాలీని పార్టీలకు సంఘాలకు అతీతంగా ప్రతి ఒక్క ఉద్యమ నాయకుడు, గిరిజన సోదర సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఏ ప్రభుత్వాలు వచ్చిన గిరిజనులను అణిచివేసే ప్రయత్నాలు చేయడం సరికాదని గుర్తు చేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ స్వలాభం కోసం మమ్మల్ని విడదీయొద్దని ప్రభుత్వాలను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల జనాభా కలిగిన గిరిజన జాతి పట్ల వారి అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రెటరీ విక్రమ్ సింహ నాయక్ జిపిఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుధాకర్ నాయక్, ఉపాధ్యక్షుడు స్వామి నాయక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు లలిత్ నాయక్, ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ నాయక్, సుబ్బయ్య, బద్దు నాయక్, కేఎల్ భాస్కర్ నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన ఐఎంఏ మహిళా వైద్య విభాగం

**-కొత్తపల్లె శ్రీ శారద విద్యాపీఠం పాఠశాలలో నిర్వహణ**

**-వివిధ అంశాలపై అవగాహన కల్పించిన మహిళా వైద్యులు మాధవి, సౌజన్య, అనూష, తనూజ, శశికిరణ్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో ఎన్. కొత్తపల్లె గ్రామంలో ఉన్న శ్రీ శారదా విద్యాపీఠం పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ సౌజన్య మంచి అలవాట్ల గురించి, డాక్టర్ గింజుపల్లి అనూష ఆరోగ్యకరమైన ఆహార అలవాట్ల గురించి, మంచి స్పర్శ, చెడుస్పర్శ ల పై డాక్టర్ తనూజ, విద్యార్థులపై మొబైల్, సోషల్ మీడియా ప్రభావం అన్న అంశంపై డాక్టర్ శశి కిరణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ద్వారా విద్యా సంస్థలలో వైద్య శిబిరాలు, వివిధ అంశాలపై అవగాహన సదస్సులు సంవత్సరం పొడవునా నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఈ కార్యక్రమాలలో నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యులు సహకారం అందజేస్తున్నారని తెలిపారు.

# దివ్యాంగులకు నూతన వస్త్రాల పంపిణీ.

**నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో.**

**లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బాబురావు కుమార్తె వివాహ వార్షికోత్సవ సందర్భంగా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 09:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బాబురావు కుమార్తె బహుళ శ్రీ, సాయికృష్ణ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ , సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పుట్టినరోజు,వివాహ వార్షికోత్సవం వంటి శుభ కార్యక్రమాలలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఇది మంచి సత్సంప్రదాయమని,అందరూ అనుసరిస్తే పేదలకు మేలు జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు,కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి,కోశాధికారి అమిదేల జనార్ధన్,నూతన వస్త్రాల దాత బాబురావు,బహుళ శ్రీ, సాయికృష్ణ దంపతులు, వారి కుమార్తె వ్యోమిక శర్మ,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య,చంద్రమోహన్,పోసినసుబ్బారావు,కన్నయ్య,సందీప్, మేడం చంద్రశేఖర్,రామయ్య, దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎర్రగుడిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు.



**ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల డిసెంబర్ 09:** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధార్మిక వ్యాప్తి కోసం నిరంతరం నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా కొలిమిగుండ్ల మండలం, ఎర్రగుడి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు మంగళవారం నుండి ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రతిరోజు ధర్మ ప్రచారకులు నిత్యతృప్త దాస్ చే శ్రీమద్రామాయణము, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు, శనివారం భజన కార్యక్రమంతో ముగియనున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుండం బాల సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, మద్దిలేటి అర్చకులు వరకుమార శర్మ, లలితమ్మ, మద్దిలేటి, కాతా గోపాల్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలని కాపాడి మానవత్వంను చాటుకున్న కానిస్టేబుల్ ప్రసాద్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించిన వెలుగోడు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ప్రసాద్మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ వృద్ధురాలని కానిస్టేబుల్ ప్రసాద్ కాపాడిన ఘటన కాపాడిన ఘటన వెలుగోడులో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే బండి ఆత్మకూరు మండలం ఎరుకల కాలనీకి చెందిన వృద్ధురాలు మతిస్థిమితం కారణంగా తిరుగుతూ వెలుగోడుకు చేరుకుంది. సోమవారం రాత్రి రాత్రి వెలుగోడు లోని వీధులలో తిరుగుతున్న వృద్ధురాలిని గమనించిన కానిస్టేబుల్ ఆమెను తీసుకెళ్లి వృద్ధాశ్రమంలో చేర్పించారు. రాత్రంతా వృద్ధాశ్రమంలో ఉంచి తిరిగి మంగళవారం ఉదయం బండి ఆత్మకూరులోని వృద్ధురాలి నివాసం వద్దకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు కానిస్టేబుల్ ప్రసాద్ అప్పగించారు. కుటుంబ సభ్యులు కానిస్టేబుల్ ప్రసాద్ కు వృద్ధాశ్రమం నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. మరోసారి మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ ప్రసాద్ ను సహకార సిబ్బంది అభినందించారు.

# విద్యుత్ ఘాతంతో పూరి గుడిసె దగ్ధం.



**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 09:** మహానందిలోని ఈశ్వర్ నగర్ సుంకులమ్మ గుడి వెనకాల పూరి గుడిసె దగ్ధమైంది. మంగళవారం రాత్రి స్థానికుల వివరాల మేరకు.. నాసరి పొట్టి రాజు అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మంటలు చెలరేగి పూరి గుడిసె పూర్తిగా కాలిపోయిందన్నారు. గుడిసెలో ఉన్న నిత్యవసర సరుకులు, బట్టలు, కొంత నగదు ఇతర వస్తువులు కాలిపోయాయి అని తెలిపారు. ఆ సమయంలో మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించిన ఫలితం లేదన్నారు. మంటలు చెలరేగి పూరి గుడిసె పూర్తిగా కాలి బూడిదయ్యిందని, దీంతో సర్వం కోల్పోయాడని బాధితుడు వాపోయాడు. కట్టుబట్టలతో బాధిత కుటుంబం బజారు పడిందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫిరోజ్ యువసేన ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ రవి జన్మదిన వేడుకలు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:** ఫిరోజ్ యువసేన ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 08వ వార్డు నాయకులు మాజీ కౌన్సిలర్ దేవరపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కొరకు నిస్వార్ధంగా పనిచేసే నాయకుడు దేవరపాటి రవికుమార్ గారు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎన్ఎండి ఫిరోజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు చాబోలు ఇలియాజ్,బుగ్గరాముడు, అడ్వకేట్ పిట్టల హనీఫ్,అలీమ్,మాబు జైలాన్, అబ్దుల్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 09:**
శరీరానికె వికలాత్వము కానీ,మనసుకు కాదని ఆత్మస్థైర్యంతో ప్రతి దివ్యాంగుడు తమకంటూ ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ముఖ్య అతిథులు ఐఎంఏ కార్యదర్శి ప్రముఖ వైద్యుడు డాక్టర్ మహ్మద్ రఫీ, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్, చైతన్య కళ భారతి అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి ,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పర్లా దస్తగిరి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల రహీం, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి మారుతి కు సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి మారుతి కుమార్ ,మార్, క్రిస్టియన్ జేఏసీ మన్యం జానయ్య,కేఎం డెంటల్ కేర్ నిర్వాహకులు డాక్టర్ మల్లేశ్వర రెడ్డి, నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ అచ్చు, ఎస్ఆర్బిసి సూపరింటెంట్ డాక్టర్ కరిముల్లా,హ్యూమన్ రైట్స్ మహిళా విన్ చైర్మన్ శ్రీమతి వహీదా అన్నారు.

స్థానిక నంద్యాల పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో జరిగిన 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలు డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాభారతి అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి ఏడు మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ, కాత్యాయని మెడికల్స్ మారుతి కుమార్ ఇద్దరు దివ్యాంగులకు చంక కర్రలు, నంద్యాల ఆర్డీవో శివారెడ్డి సౌజన్యంతో ఒక పేద వికలాంగురాలికి కుట్టు మిషన్ పంపిణీ చేయడం జరిగినది. 250 మందికి భోజన వసతి కల్పించడం జరిగింది. దివ్యాంగులకు సేవలు అందించిన అతిథులు అందరికీ దృశ్యాలువా మెమొంటోలతో సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మధుర స్వీట్స్ లింగారెడ్డి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాయలసీమ జోన్ ఇన్చార్జ్ డాక్టర్ ఎన్ ఎమ్ డి ఫయాజ్, ఆత్మీయ ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వాతి, దివ్యాంగుల సంఘం నాయకులు జహీరుద్దీన్,సక్క్యం సుబ్బారావు, మరియదాసు, సుధాకర్, చంద్రశేఖర్ అ తదితరులు పాల్గొన్నారు.

## కడప ఇస్తేమా ఇస్లామిక్ ఆధ్యాత్మిక సదస్సును విజయవంతం చేస్తాం.





**ఆంధ్ర ప్రగతి కడప డిసెంబర్ 09:**
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల దీన్ ఏ తబ్లీగ్ ఇస్తేమా కడప నగరంలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో జనవరి 23, 24, 25 తేదీలలో జరగనున్న సభ ఏర్పాట్లను తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఇస్తేమా కమిటీ సభ్యులతో కలిసి ఇస్తేమా ప్రాంగణాన్ని సందర్శించి వారితో వివిధ అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఇస్తేమా కమిటీ సభ్యులు వివిధ పెండింగ్ లోనున్న పనులు, ప్రభుత్వ అనుమతుల అంశాలను ఫిరోజ్ దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారం కొరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ కు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 5 లక్షల మందికి పైగా ముస్లిం సోదరులు 3 రోజుల పాటు ఈ ఇస్తేమాకు హాజరు కానున్నరాని వారికి ప్రభుత్వం తరుపున మౌలిక వసతుల కల్పన కొరకు ఇదివరకే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు %చీఎం% ఫరూక్ గారి చొరవతో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ ఇస్తేమా ప్రాంగణంలో పెండింగ్ లోనున్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటు, తాగునీటి సరఫరా, తాత్కాలిక రోడ్ నిర్మాణం, రవాణా సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాల పై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కడపలో జరగబోయే అత్యంత భారీ స్థాయిలో జరగబోయే ఇస్లామిక్ ఆధ్యాత్మిక సదస్సును విజయవంతం చేసేందుకు తన వంతు సహాయాసహకారాలు తప్పక అందిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ అహ్మద్, కడప మైనారిటీ సంక్షేమ అధికారి హీదాయతుల్లా, ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫిజ్ అంజాద్ భాష, నీటి సంఘం ఛైర్మన్ చాబోలు ఇలియాస్, హాఫిజ్ అబ్దుల్ హాది, కడప టీడీపీ పట్టణ ప్రెసిడెంట్ మన్సూర్ అలీ,సీనియర్ టీడీపీ నాయకులు జీలాని భాష, సలాం,కడప నగర జామత్ అమీర్ అబ్దుల్ ఖదీర్, నూరుల్లా ఖాన్, అబ్దుల్ సలాం మౌలాన,పిట్టాల





హనీఫ్, పఠాన్ జాకీర్ అలీ, మిద్దె హుస్సేని,మునీర్,ఖాధర్ కింగ్ బుగ్గారాముడు మరియు మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి.

-మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి.




**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 09:**
రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి, వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రైతులు విచక్షణారహితంగా యూరియా ఎరువులు వాడరాదన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడుట ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా నేల, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు అన్నారు. కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. వరిలో పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు, గంధకము కలిగి ఉన్న ఎరువులనువాడరాదన్నారు. దుక్కిలో భాస్వరం, పొటాష్ ఎరువులు ఖచ్చితముగా వాడాలని సూచించారు. జీవన, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. రెవిన్యూ అధికారి మాధవ్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన అధికారులు మంజుల, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్య నేరం.




**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 09:**
బాల్య వివాహాలు చెయ్యడం చట్టరీత్యా నేరం అని ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు, బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ... బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం.. బాలుడికి 21, బాలిక కు 18 సంవత్సరాలు నిండక ముందు పెళ్లి చేయడం నేరమని తెలిపారు. బాల్యవివాహాలు సామాజికంగా, ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తాయని తెలిపారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల తల్లిశిశు మరణాలు పెరుగుతాయని తెలిపారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు కూడా ఎక్కువగా తలెత్తుతాయని పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, 18ఏళ్ల లోపు వయసు గల పిల్లల పై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి సునీల్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రక్తం మరిగిన గ్రామ సింహాలు.

### గొర్రెలపై కుక్కల స్వైరా విహారం.
### 5 పొట్టేలు మృతి.
### మరో రెండింటికి అస్వస్థత.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ డిసెంబర్ 09:**

యర్రగుం మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో గల ఎల్లమ్మ పేటలో గొర్రెల మంద పై కుక్కలు సైరా విహారం చేశాయి. రక్తం మరిగిన గ్రామ సింహాలు బ్రతికి ఉన్న గొర్రెలను చీల్చిచండాడాయి. కుక్కల దాడిలో గొర్రెల కళేబరాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. రక్తం మరిగిన కుక్కలు గొర్రెల కళేబరాన్ని చూసిన యజమాని చాకలి మల్లికార్జున భయాందోళనకు గురిఅయ్యారూ. ఐదు పొట్టేలు మృత్యువాత పడగా రెండు పొట్టేలు అస్వస్థకు గురి అయ్యాయి. రాత్రి సమయంలో పొట్టేళ్ల యజమాని మరియు కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా గొర్రెల సంరక్షణ కోసం పటిష్టంగా ఏర్పాటు చేసిన బండలను కుక్కల సైతం ఎగిరి జీవాలపై దాడి చేశాయని యజమాని కన్నీరు మున్నేరుగా విలపించారు. కుక్కల దాడిలో సుమారు లక్ష కు పైగా వాటిల్లిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నష్టపోయిన మల్లికార్జున కు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామ అధికారులు కుక్కల బెడదను అరికట్టి పాడి, పరిశ్రమ మూగ జీవాలకు రక్షించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గుదిబండగా మారిన వీసాల జారీ



**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:** ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో వీసాల జారీ గుదిబండగా మారింది. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటుంటే వారి కలలకు అమెరికా అడ్డుకట్ట వేస్తోంది. అర్ధంలేని ఆంక్షలతో భారతీయ విద్యార్థులపై కొరడా ఝులిపిస్తుంది. ప్రపంచ దేశాలకు పెద్దన్న అయిన అమెరికాకు వెళ్లేందుకు చాలా మంది ఏటా ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, స్థిర నివాసం కోసం అమెరికా వెళ్తూ ఉంటారు. కానీ ఇప్పుడు అమెరికా అంటేనే స్టూడెంట్స్, పేరెంట్స్ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ట్రంప్ ఎప్పుడు ఏం బాంబ్ పేలుస్తారో.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. దాని వల్ల తమకేం ఇబ్బందులు వస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాదిలో అమెరికా ఇచ్చే స్టూడెంట్ వీసాలకు అప్లై చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఎంతలా అంటే కొవిడ్ సమయంలో కూడా ఇంతకు పడిపోవడం జరగలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటారు. అందుకోసం చాలా కష్టపడి చదివి.. అర్హత పరీక్షలు రాస్తారు. ఈసారి కాకపోతే వచ్చేసారి అంటూ ఏళ్ల తరబడి అమెరికా యూనివర్సిటీల్లో అడ్మిషన్ కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అమెరికాలో చదివించాలనే బలమైన పట్టుదలతో ఉంటారు. కానీ.. ప్రస్తుతం ఆ కలలు మొత్తం కల్లలు అవుతున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని.. అమెరికాలో చదవాలని భావించే భారత విద్యార్థులు.. వెనకడుగు వేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి విస్తరించిన సమయంలో కంటే తక్కువగా.. ఈసారి స్టూడెంట్ వీసాలకు దరఖాస్తులు వచ్చినట్లు అమెరికా దౌత్య అధికారులు చెబుతున్నారు. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే ఇండియన్ స్టూడెంట్స్ కలలు ఈ ఏడాది ఆరంభంలోనే సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా అమెరికా స్టూడెంట్ వీసాల సీజన్‌కు.. ప్రతీ ఏడాది మార్చి నుంచి జూలై నెలలు చాలా కీలకంగా ఉంటుంది. ఆగస్టు/సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ఫాల్ సెమిస్టర్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు.. మార్చి నుంచి జూలై మధ్య వీసాల కోసం భారీగా దరఖాస్తు చేసుకుంటారు. అయితే తాజా గణాంకాలు భారతీయ విద్యార్థులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య కాలంలో జారీ అయిన ఎఫ్-1 (అకాడమిక్) (ఎఫ్-1) వీసాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది కేవలం 9,906 ఎఫ్-1 వీసాలు మాత్రమే భారతీయ విద్యార్థులకు జారీ అయ్యాయి. అంతకుముందు 2023లో ఇదే కాలంలో 14,987 వీసాలు జారీ కాగా.. 2024లో 13,478 వీసాలు భారతీయ విద్యార్థులు పొందారు. మరీ ముఖ్యంగా.. కొవిడ్-19 మహమ్మారి తర్వాత అంతర్జాతీయ ప్రయాణాలు తిరిగి ప్రారంభమైన 2022 మార్చి నెల నుంచి మే నాటి 10,894 వీసాలతో పోలిస్తే.. ఈ ఏడాది మరింత తగ్గడం గమనార్హం. అమెరికా స్టూడెంట్ వీసాలు తగ్గడంలో కొన్ని కీలక కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణం అని తెలుస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ గాజా యుద్ధంలో భాగంగా పాలస్తీనా మద్దతు ఆందోళనల్లో పాల్గొన్న పలువురు విద్యార్థుల (కొందరు భారతీయ విద్యార్థులు) వీసాలను రద్దు చేయడం.. అలాగే మే 27వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు కొత్త వీసా దరఖాస్తులను 2 వారాల పాటు నిలిపివేసి.. దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలపై నిఘా (సోషల్ మీడియా వెట్టింగ్) పెట్టడం వంటి ఆంక్షలతో విదేశీ విద్యార్థులు.. అమెరికాలో చదువుకోవాలంటేనే ఆలోచించే పరిస్థితి నెలకొంది. ఈ వీసా అప్లికేషన్లు 2 వారాలు ఆపడం వల్ల కూడా వీసా దరఖాస్తులు తగ్గడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికన్ యూనివర్సిటీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో కోతలు విధించడం, అంతర్జాతీయ విద్యార్థుల నమోదుపై పెరుగుతున్న నిఘా వంటి సవాళ్లు కొత్తగా వచ్చి పడ్డాయి. పొలిటికో నివేదిక ప్రకారం.. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అమెరికా రాయబార కార్యాలయాలను, కాన్సులర్ విభాగాలను విద్యార్థి వీసా దరఖాస్తుదారులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి.. వారి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. జూన్ నాటికి.. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఎఫ్, ఎమ్, జే కేటగిరీ వీసా దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి వారి సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌గా ఉంచాలని సూచించింది. ఈ ఏడాది మొదట్లో వీసా దరఖాస్తులు నెమ్మదించినప్పటికీ.. గత కొన్నేళ్లుగా అమెరికాలో చదువుకునేందుకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. ఓపెన్ డోర్స్ 2024 డేటా ప్రకారం.. 2023-24 అకడమిక్ ఇయర్‌లో చైనా విద్యార్థులను అధిగమించి.. అమెరికాలోనే అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థులుగా భారతీయ విద్యార్థులు నిలిచారు. అంతకుముందు అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అగ్రస్థానంలో ఉండగా.. వారిని భారతీయులు అధిగమించారు. ఇది అమెరికా విద్య పట్ల భారతీయ విద్యార్థులకు ఉన్న ఆసక్తిని, పోటీని తెలియజేసింది. అయితే.. 2024లో మొత్తం విద్యార్థి వీసా జారీల్లో తగ్గుదల కనిపించింది. ఆ తర్వాత ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో ఆ సంఖ్య మరింత తగ్గింది. కొవిడ్ మహమ్మారి తర్వాత.. 2024లో భారతీయ పౌరులకు అమెరికా విద్యార్థి వీసాలు భారీగా తగ్గించినట్లు తెలుస్తోంది. జనవరి నుంచి సెప్టెంబర్ 2024 వరకు.. భారతీయ విద్యార్థులకు కేవలం ఎఫ్-1 వీసాలు 64,008 మాత్రమే జారీ అయ్యాయని తెలుస్తోంది. ఇదే 2023లో 1.03 లక్షలు.. 2022లో 93,181 నుంచి గణనీయమైన తగ్గుదల కనిపించింది.

# శ్రీవారి దర్శనం ఇక మరింత సులభం

## ఏఐ ఆధారిత ఐసీసీసీ కేంద్రం ఏర్పాటు

**అమరావతి,డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి::** శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే బ్రహ్మోత్సవాల సందరరేగా సీఎం చంద్రబాబు ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఏ కంపార్ట్‌మెంట్‌లో భక్తులు ఎంతసేపటి నుంచి వేచి ఉన్నారనే వివరాలను ఏఐ టెక్నాలజీతో గుర్తిస్తారు. ఎక్కువసేపు నిరీక్షిస్తున్న వారికి ప్రాధాన్యతనిచ్చి, వారిని త్వరగా దర్శనానికి పంపేలా చర్యలు తీసుకుంటారని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీక ృష? వివరించారు. భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించినప్పటి



నుంచి దర్శనం పూర్తయ్యే వరకు పూర్తి సమాచారం డాష్‌బోర్డులో కనిపిస్తుంది. దర్శనమే కాకుండా, అన్నప్రసాదాల వితరణను కూడా ఈ కేంద్రం సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఎంతమంది భక్తులకు అన్నప్రసాదం అందించారు, ఇంకా ఎంతమందికి అవసరం అనే వివరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తుంది. భద్రతను పెంచేందుకు 250 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను కొనుగోలు చేయనున్నారు. నేర చరిత్ర ఉన్నవారి డేటాను దీనికి అనుసంధానం చేసి, అనుమానితులను సులువుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే తిరుమలకు వచ్చే వాహనాల సమాచారాన్ని పర్యవేక్షిస్తూ, కాలుష్య నియంత్రణకు పాత వాహనాలను నిలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.16 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.30 కోట్లకు చేరుతుందని అంచనా. ఏడుగురు దాతలు ఈ కేంద్రం నిర్మాణానికి సహకారం అందించారు. ఏడాది పాటు దీని నిర్వహణ బాధ్యతలను కూడా వారే చూసుకోనున్నారు. మొత్తం మీద భక్తులకు ఈ ఆధునిక సాంకేతికతతో తిరుమలలో పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది.

# ప్రయాణికుల సమస్యలపై ఆరాతీయండి

**ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం**

**ఇండిగో సంక్షోభంపై మంత్రి రామ్మోహన్ దృష్టి**

**ఎయిర్‌పోర్టులకు ప్రత్యేక బృందాల తరలింపు**

**కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం**

న్యూఢిల్లీ,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?ంచిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ



శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను..ఏం చేయాలి యార్ అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. ఓ యూజర్ ..అతను త్వరగా వివాహం చేసుకోవాలని, అతని సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కారమవ్వాలని, విమానాశ్రయాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను అంటూ స్పందించారు.

# రేణుకా చౌదరి శునకం వివాదంపై బీజేపీ సీరియస్

## రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేత



న్యూఢిల్లీ,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున రేణుకా చౌదరి తన వాహనంలో ఓ శునకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె ప్రవర్తన సభా హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసును పరిశీలించిన ఛైర్మన్, తదుపరి విచారణ నిమిత్తం హక్కుల కమిటీకి (ప్రివిలేజ్ కమిటీ) పంపారు. ఈ కమిటీ రేణుకా చౌదరి వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, తన సిఫారసులతో కూడిన నివేదికను ఛైర్మన్‌కు సమర్పించనుంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వివాదంలో తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

# కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..



న్యూఢిల్లీ,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:**
వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్ లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్‌లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్‌లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్టర్స్‌కు సమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు. తనకు ప్రయాణాలంటే ఇష్టమని, వీసా నిబంధనల ఉల్లంఘన గురించి తనకు తెలియదని చెబుతున్నాడు. అతడిని ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బుద్గాం జిల్లా హుమ్హామా పోలీస్ పోస్టులో విచారిస్తున్నారు. అతడి పర్యటన వెనుక అసలు ఉద్దేశాన్ని రాబట్టేందుకు భద్రతా ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

## అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు



హైదరాబాద్,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి:** మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు.. ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఆ అనుమానాస్పద మెయిల్ న్యూయార్క్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఎలాంటి ముప్పు లేదని సెక్యూరిటీ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి 20కిపైగా బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. 5 ఘటనల్లో నిందితుల గుర్తించారు. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతోంది.

# విజయ్ సభ వద్ద కలకలం..

## తుపాకీతో సభకు వచ్చిన వ్యక్తి

పుదుచ్చేరి,**డిసెంబర్ 9 ఆంధ్ర ప్రగతి::** పుదుచ్చేరిలో నటుడు విజయ్ ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) బహిరంగ సభ వద్ద కలకలం రేగింది. సభా ప్రాంగణంలోకి తుపాకీతో ప్రవేశించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతడిని పార్టీ శివగంగై జిల్లా కార్యదర్శి ప్రభుకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న డేవిడ్‌గా గుర్తించారు. ఈ ఘటనతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషాదం తర్వాత విజయ్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఇదే కావడంతో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్స్‌పో గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ సభకు పార్టీ అభ్యర్థన మేరకు కేవలం 5,000 మందిని మాత్రమే అనుమతించినట్లు సీనియర్ ఎస్పీ ఆర్. కలైవానన్ తెలిపారు. భద్రతా కారణాల ద ృష్ట్యా పొరుగున ఉన్న తమిళనాడు నుంచి ప్రజలు రావద్దని పోలీసులు ముందే సూచించారు. సభా ప్రాంగణంలోకి పిల్లలు, గర్భిణులు, వ ృద్ధులకు ప్రవేశం నిరాకరించారు. పార్టీ జారీ చేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్ పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించారు. తాగునీరు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స బ ృందాలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు విజయ్ రోడ్ షోకు అనుమతి నిరాకరించిన పోలీసులు, కేవలం సభకు మాత్రమే కఠిన షరతులతో కూడిన అనుమతినిచ్చారు.

............

# టీమిండియా ఆల్ రౌండ్ షో



## 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా... 101 పరుగుల తేడాతో టీమిండియా విన్

### కటక్ లో మ్యాచ్
### 176 పరుగుల ఛేజింగ్ లో చేతులెత్తేసిన సఫారీలు
### 12.3 ఓవర్లలోనే ఆలౌట్




దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 101 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన ముందు సఫారీ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు, కేవలం 12.3 ఓవర్లలో 74 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ క్వింటన్ డికాక్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత ట్రిస్టన్ స్టబ్స్ (14), కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ (14) కాసేపు నిలబడినా, స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. కీలక బ్యాటర్లు డేవిడ్ మిల్లర్ (1), డొనోవాన్ ఫెరీరా (5) పూర్తిగా విఫలమయ్యారు. ఒక దశలో డివాల్డ్ బ్రెవిస్ (22) కాస్త దూకుడుగా ఆడినా, అతనికి మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అతడే టాప్ స్కోరర్‌గా నిలవడం వారి బ్యాటింగ్ వైఫల్యాన్ని తెలియజేస్తోంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలో రెండు వికెట్లు పడగొట్టి సఫారీ పతనాన్ని శాసించారు.అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఒక దశలో 104 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును హార్దిక్ పాండ్యా ఆదుకున్నాడు. కేవలం 28 బంతుల్లో 4 సిక్సర్లు, 6 ఫోర్లతో అజేయంగా 59 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అతనికి తిలక్ వర్మ (26), అక్షర్ పటేల్ (23) నుంచి సహకారం లభించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి మూడు వికెట్లు తీశాడు.ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 11న న్యూ ఛండీగఢ్ లో జరగనుంది.

# పాండ్యా స్థానాన్ని ఎవరూ రీప్లేస్ చేయలేరు


### టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్




దక్షిణాఫ్రికాతో జరగబోయే ముఖ్యమైన టీ20 అంతర్జాతీయ సిరీస్‌కు ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పై భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్దిక్ జట్టులో 'ఇర్రీప్లేసబుల్' అంటే, ఎవరూ భర్తీ చేయలేని ఆటగాడు అని బంగర్ అభివర్ణించారు. వికెట్ల మధ్యలో వేగంగా పరుగులు చేయగల సామర్థ్యం, అలాగే నలుగురు ప్రధాన పేసర్లలో ఒకరిగా తన కోటా అయిన నాలుగు ఓవర్లను పూర్తి చేయగల సత్తా హార్దిక్‌కు ఉంది. ఈ ప్రత్యేకమైన సమతుల్యత కారణంగా భారత జట్టులో అతని స్థానం అత్యంత ముఖ్యమైనదని బంగర్ స్పష్టం చేశారు. సంజయ్ బంగర్ మాట్లాడుతూ.. "హార్దిక్ పాండ్యా బౌలింగ్, బ్యాటింగ్‌లలో జట్టుకు అందించే సమతుల్యత చాలా అద్భుతమైనది. అతను లోయర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగలడు, అదే సమయంలో నలుగురు పేసర్లలో ఒకరిగా నాలుగు ఓవర్లు వేయగలడు. ఈ కారణంగానే టీమిండియాలో అతని స్థానం అసాధారణమైనది, దానిని ఎవరూ భర్తీ చేయలేరు" అని తెలిపాడు. టీమిండియా రాబోయే ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 కోసం సన్నాహాలు చేస్తున్న తరుణంలో, హార్దిక్ పాండ్యా పాత్ర మరింత కీలకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అతను పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉండి, బ్యాట్, బాల్‌తో రాణిస్తే, భారత్ జట్టుకు అది గొప్ప బలాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. దక్షిణాఫ్రికాతో జరిగే ఈ టీ20 సిరీస్.. హార్దిక్ పాండ్యా తన ఫామ్, ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడానికి, జట్టులో తన 'ఇర్రీప్లేసబుల్' హోదాను మరోసారి నిలబెట్టుకోవడానికి ఒక మంచి వేదిక కానుంది

# నాకు ప్రశాంతత అంటే అది కాదు!

### • స్మృతి మంధాన ఆసక్తికర పోస్టు




టీమ్‌ఇండియా క్రికెటర్ స్మృతి మంధాన పెళ్లి రద్దు చేసుకున్న మరుసటిరోజే ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఈ పోస్టుకు ఆసక్తికరమైన క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ క్యాప్షన్ అందర్నీ ఆకర్షిస్తోంది.పలాశ్ ముచ్చల్?తో వెడ్డింగ్ క్యాన్సిల్ చేసుకుంటున్నట్లు అదివారం ప్రకటన చేసిన మంధాన, మరుసటి రోజే సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసింది. అయితే ఈ పోస్ట్ ప్రమోషన్?కు సంబంధించింది. ఓ బ్రాండ్?ను ప్రమోట్ చేస్తున్న ఆమె ఎండార్స్?మెంట్?కు సంబంధించిన వీడియోను తన ఇన్?స్టాగ్రామ్? అకౌంట్?లో పోస్ట్ చేసింది. ఈ పోస్ట్?కు "నాకు ప్రశాంతత అంటే మౌనం కాదు, నియంత్రణ" అంటూ రాసుకొచ్చింది. దీంతో ఈ క్యాప్షన్ అందర్నీ ఆకర్షిస్తుంది. ఆమె లైఫ్?లో ప్రస్తుత పరిస్థితిని ఉద్దేశించే ఇలా రాసిందంటూ ఫ్యాన్స్ అంటున్నారు. అలాగే జరిగింది మర్చిపోయి, ముందుకు సాగుతూ కెరీర్?లో ఇంకెంతో సాధించాలంటూ కామెంట్ చేస్తున్నారు. అయితే మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్?తో తన వివాహం రద్దు చేసుకున్నట్లు రీసెంట్?గా మంధాన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేసింది. "గత కొన్ని వారాలుగా నా జీవితం చుట్టూ చాలా ఊహాగానాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేను మాట్లాడటం ముఖ్యమని భావిస్తున్నా. నా గురించి అన్నీ గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తిని నేను. కానీ, వివాహం రద్దయిందని స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ విషయాన్ని ఇక్కడితో ముగిస్తారని భావిస్తున్నా. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని కోరుతున్నా. భారత్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడి ట్రోఫీలు గెలిచేలా కృషి చేస్తా. మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు. ముందుకు సాగవలసిన సమయం ఇది" అని మంధాన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్?లో రాసుకొచ్చింది. "నేను జీవితంలో ముందుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాను. ఆధారాల్లేని వదంతులను ఈజీగా నమ్మకూడదని కోరుతున్నా. ఇది నా జీవితంలో అత్యంత కష్టసమయం. ఆధారాల్లేని ఈ వదంతులు వ్యాప్తి చేసేముందు ముందు ఒక్కసారి ఆలోచించాలి. ఇలాంటి అంశాల్లో మన మాటలు అవతలి వ్యక్తిని బాధిస్తాయనే విషయాన్ని గుర్తించి అర్థం చేసుకోవాలి. నా ప్రతిష్ఠకు భంగం కలిగించే, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై మా లీగల్ టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్ట సమయంలో నాకు అండగా నిలిచినవారికి ధన్యవాదాలు" అని పలాశ్ మచ్చల్ తన ఇన్?స్టా స్టోరీలో రాసుకొచ్చారు. కాగా, ఈ ఇద్దరి పెళ్లి గతనెల 23న జరగాల్సింది. కానీ, ఆ రోజు మంధాన తండ్రి శ్రీనివాస్ ఆనారోగ్యానికి గురవ్వడంతో పెళ్లి వాయిదా పడింది. ఆ తర్వాత స్మృతిని కించపరుస్తూ పలాశ్ ఇంకో అమ్మాయితో చనువుగా చాటింగ్ చేశాడని ఆరోపిస్తూ కొన్ని స్క్రీన్ షాట్లు వైరల్ అయ్యాయి. దీనిపై ఇరు కుటుంబాలు స్పందించలేదు. అనంతరం తమ పెళ్లి రద్దు చేసుకున్నట్లు మంధాన- పలాశ్ వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు.

# శ్రీలంకతో భారత్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్

### భారత మహిళల జట్టును ప్రకటించిన బీసీసీఐ
### కెప్టెన్‌గా వ్యవహరించనున్న హర్మన్‌ప్రీత్ కౌర్
### స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు

శ్రీలంక మహిళల జట్టుతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం (డిసెంబర్ 9) ప్రకటించింది. ఈ సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించ నుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది. నవంబర్ 2న జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌ను గెలుచుకున్న భారత జట్టు అప్పటి నుంచి విరామం తీసుకుంది. కొంతమంది ఆటగాళ్ళు దేశీయ క్రికెట్‌లో చురుగ్గా ఉన్నప్పటికీ, చాలా మంది ఈ సమయాన్ని విశ్రాంతి తీసుకోవడానికి, తమను తాము రిఫ్రెష్ చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. ఇప్పుడు, శ్రీలంక జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారతదేశాన్ని సందర్శిస్తున్నందున జట్టు విరామం త్వరలో ముగుస్తుంది. ఇది ప్రపంచ కప్ తర్వాత టీమ్ ఇండియాకు మొదటి సిరీస్ అవుతుంది. ఈ జట్టులో వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైన చాలా మంది క్రీడాకారిణులు కూడా ఉన్నారు. అయితే, అత్యంత ప్రముఖమైన పేరు స్మృతి మంధాన. మంధాన ఇటీవల తన వివాహాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. నవంబర్ 23న పలాష్ ముచ్చల్‌ను వివాహం చేసుకోవాల్సి ఉంది. కానీ ఆ రోజు అది వాయిదా పడింది. ఆపై రెండు వారాల తర్వాత, మంధాన తన వివాహాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఫలితంగా, ఈ పెద్ద వ్యక్తిగత ఎదురుదెబ్బ తర్వాత మంధాన వెంటనే మైదానంలోకి తిరిగి వస్తుందా లేదా విరామం తీసుకుంటుందా అనే దానిపై దృష్టి కేంద్రీకరించబడింది. అయితే, టీం ఇండియా వైస్-కెప్టెన్ తాను తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేసింది. సిరీస్ వివరాలు: భారత్, శ్రీలంక మహిళల జట్ల మధ్య మొత్తం 5 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్ డిసెంబర్ 21న ప్రారంభమై డిసెంబర్ 30న ముగుస్తుంది. వేదికలు: విశాఖపట్నం, తిరువనంతపురం వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నా యి. జట్టు ఎంపిక: ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో హర్మన్‌ప్రీత్, స్మృతి మంధానతో పాటు షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి కీలక క్రీడాకారిణులు ఉన్నారు. వికెట్ కీపర్లుగా రిచా ఘోష్, జి. కమలిని ఎంపికయ్యారు. కొత్త ముఖాలుగా శ్రీ చరణి, వైష్ణవి శర్మ జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత మహిళల టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, స్నేహ రాణా, హర్లీన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్ ఠాకూర్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), కమలిని (వికెట్ కీపర్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ.



# టీమిండియా కాంబినేషన్‌పై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు



సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. మంగళవారం కటక్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు సిద్ధమయ్యాయి. ఈ సిరీస్‌లో టీమిండియా బరిలోకి దిగే కాంబినేషన్‌పై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ 2026 కావాల్సిన కాంబినేషన్‌ను ఈ సిరీస్‌తో సెట్ చేసుకోవాలని సూచించాడు. ఈ సిరీస్‌లో భారత్ విజయం సాధించాలంటే ఐదుగురి ఆటగాళ్లను తప్పకుండా తుది జట్టులో ఆడించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 'శుభ్‌మన్ గిల్ రీఎంట్రీతో సంజూ శాంసన్ మూడో స్థానంలో ఆడుతాడా? లేదా? అనేది సందేహంగా మారింది. ఫస్ట్ డౌన్‌లో సూర్య లేదా తిలక్ వర్మను ఆడించవచ్చు. సంజూను మూడో స్థానంలో ఆడించాలి. కానీ శుభ్‌మన్ గిల్ రాకతో అతనికి అవకాశాలు సన్నగిల్లాయి. గతంలో ఓపెనర్ కమ్ కీపర్‌గా రాణించి సత్తా చాటిన సంజూకు జట్టులో చోటు లేని పరిస్థితి నెలకొంది. ఓపెనర్‌గా స్పెషలిస్ట్ బ్యాటర్ అయిన గిల్ ఎంట్రీతో.. మిడిలార్డర్‌లో ఆడే వికెట్ కీపర్ కమ్ ఫినిషర్ భారత జట్టుకు అవసరం ఉంది. ఈ సిరీస్ భారత బ్యాటర్ల పాత్రపై మేనేజ్‌మెంట్ స్పష్టతతో ఉంటుందని ఆశిస్తున్నా. భారత బ్యాటింగ్ లైనప్‌కు తగ్గట్లుగానే సౌతాఫ్రికా ఆడనుంది. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ గెలవగల సత్తా సౌతాఫ్రికాకు ఉందో లేదో ఈ సిరీస్‌తో తేలనుంది. అందుకే ఈ సిరీస్ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. సౌతాఫ్రికా జట్టులో ప్రమాదకరమైన ఆటగాళ్లు ఎవరూ లేరు. కుల్దీప్, వరుణ్, బుమ్రా వంటి బౌలర్లు ఆ జట్టులో కనిపించడం లేదు. భారత్‌కు కూడా ఇది కీలకమైన సిరీస్. టీమ్‌కాంబినేషన్‌ను ఎంచుకోవాలి. ఇప్పటికే చాలా ప్రయోగాలు చేశారు. టీ20 జట్టులో స్థిరత్వం కీలకం. అర్ష్‌దీప్ సింగ్‌ను టీ20 జట్టులో కొనసాగిస్తారా? లేదా? అనేది కూడా తేల్చుకోవాలి. నా అభిప్రాయం ప్రకారం అతన్ని జట్టులో ఆడించాలి. వరుణ్, కుల్దీప్ యాదవ్ ఇద్దర్నీ ఆడించగలమో లేదో చూసుకోవాలి. మంచు ప్రభావం ఉంటే మూడో పేసర్‌ను తీసుకోవాలి. లేదంటే బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యాలు ఆడాలి. ఈ బౌలింగ్ దాడికి ప్రత్యర్థిని ఆలౌట్ చేయగల సామర్థ్యం ఉంది. ఈ బౌలర్లతో ఎంత స్కోర్‌నైనా కాపాడుకోవచ్చు. తొలి మ్యాచ్‌లో ఈ బౌలింగ్ లైనప్‌ను చూడాలని అనుకుంటున్నా. టీ20 ప్రపంచకప్ ముందు వరుణ్ చక్రవర్తి హిడెన్ టాలెంట్‌ను బయటపెట్టవద్దు. ప్రపంచకప్‌లోనే అతని అసలు అస్త్రాన్ని వాడాలి.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.



# కాలేజీ రోజుల్లో లెక్చరర్ తో ప్రేమలో పడ్డాను

## : రాశీ సింగ్

యంగ్ హీరోయిన్ రాశీ సింగ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. కాలేజీ రోజుల్లో తన లెక్చరర్‌తోనే ప్రేమలో పడ్డానని, ఆయనే తన ఫస్ట్ క్రష్ అని ఆమె వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

రాశీ సింగ్ మాట్లాడుతూ, "కాలేజీలో మా లెక్చరర్‌తో ప్రేమలో పడ్డాను. ఆయన చూడటానికి చాలా యంగ్‌గా, అందంగా ఉండేవారు. చదువులో నాకు ఎంతో సహాయం చేసేవారు. వైవా సమయంలో నన్ను ప్రశ్నలు అడిగేవాడు కాదు. రూమ్‌లో సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్లం. ఆయనే నా ఫస్ట్ లవ్. అయితే మా ప్రేమలో మేం ఎప్పుడూ హద్దులు దాటలేదు" అని తెలిపారు.ప్రస్తుతం ఆ లెక్చరర్‌కు వివాహం జరిగిందని, అయినా ఇప్పటికీ తనను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతున్నారని ఆమె చెప్పుకొచ్చారు. తన ప్రేమ విషయంపై రాశీ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఆది సాయికుమార్ హీరోగా 2021లో వచ్చిన 'శశి' చిత్రంతో రాశీ సింగ్ హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'భూతద్ధం భాస్కర్ నారాయణ', 'ప్రేమ్ కుమార్', 'ప్రసన్న వదనం' వంటి చిత్రాల్లో నటించి తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# 'నరసింహ' సీక్వెల్‌పై చర్చలు జరుగుతున్నాయన్న రజనీకాంత్



సూపర్ స్టార్ రజనీకాంత్ తన అభిమానులకు ఓ అదిరిపోయే శుభవార్త చెప్పారు. తన కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పడయప్ప' (తెలుగులో 'నరసింహ') చిత్రానికి సీక్వెల్ రాబోతోందని సంకేతమిచ్చారు. ఈ సీక్వెల్ కోసం కథా చర్చలు జరుగుతున్నాయని, అంతా అనుకున్నట్లు జరిగితే అభిమానులకు మరోసారి పండగలాంటి సినిమా అందిస్తానని స్పష్టం చేశారు. డిసెంబర్ 12న తన 75వ పుట్టినరోజు సందర్భంగా 'పడయప్ప' సినిమాను రీ-రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ది రిటర్న్ ఆఫ్ పడయప్ప' పేరుతో విడుదల చేసిన ఓ వీడియోలో రజనీ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఇటీవల '2.0', 'జైలర్ 2' వంటి సీక్వెల్స్ వస్తున్నాయి. అలాంటప్పుడు 'పడయప్ప'కు రెండో భాగం ఎందుకు చేయకూడదని అనిపించింది" అని ఆయన తెలిపారు."తొలి భాగంలో నీలాంబరి (రమ్యకృష్ణ) వచ్చే జన్మలోనైనా పగ తీర్చుకుంటానని చెబుతుంది. అందుకే 'నీలాంబరి - పడయప్ప 2' అనే టైటిల్‌తో కథపై చర్చిస్తున్నాం. సినిమా బాగా వస్తే, అభిమానులకు మరో పండగే" అని ఆయన వివరించారు. ఈ చిత్రానికి అసలు నిర్మాతను, కథ అందించింది కూడా తానేనని రజనీ ఈ వీడియోలో వెల్లడించారు.'పడయప్ప' అనే టైటిల్ కూడా తనే సూచించానని రజనీకాంత్ తెలిపారు. "నేను ఆ టైటిల్ చెప్పగానే దర్శకుడు కేఎస్ రవికుమార్ ఆశ్చర్యపోయారు. ఈ పదం పాతగా అనిపిస్తోందని అన్నారు. కానీ, ఆ టైటిల్‌లో ఒక వైబ్రేషన్ ఉందని చెప్పి ఒప్పించాను" అని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ ప్రకటనతో 'నరసింహ' సీక్వెల్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'అఖండ-2' వివాదానికి శుభం కార్డు.. ఈ నెల 12న విడుదల!



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ-2: తాండవం' సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. నిర్మాణ సంస్థల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఈ నెల 5న నిలిచిపోయిన ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. త్వరలోనే ఈ సినిమా థియేటర్లలోకి రానుండటంతో బాలయ్య అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.14 రీల్స్, ఈరోస్ సంస్థల మధ్య వున్న ఆర్థిక వివాదం కారణంగా ఈ సినిమా విడుదల ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, సోమవారం రాత్రి ఈ రెండు సంస్థల ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఇరువర్గాలు ఒక అంగీకారానికి రావడంతో వివాదం ముగిసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని ఈరోజు ఉదయం 10:30 గంటలకు మద్రాస్ హైకోర్టుకు నివేదించి, సినిమా విడుదలకు అధికారిక అనుమతులు తీసుకోనున్నారు.వివాదం సద్దుమణగడంతో 'అఖండ-2' చిత్రాన్ని ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఒకరోజు ముందుగా అంటే ఈ నెల 11న ప్రీమియర్ షోలు ప్రదర్శించే అవకాశం కూడా ఉందని సమాచారం. న్యాయస్థానం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే సినిమా ప్రమోషన్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఇది బాలయ్య అభిమానులకు నిజంగా గుడ్‌న్యూస్ అనే చెప్పాలి.

# ఎల్లలు దాటిన రామ్ చరణ్ క్రేజ్..

## ఇండియా వచ్చిన జపాన్ ఫ్యాన్స్‌కు అదిరిపోయే ట్రీట్



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్‌కు జపాన్‌లో ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయనపై ఉన్న అభిమానంతో కొందరు జపనీస్ ఫ్యాన్స్ ఏకంగా ఇండియాకే వచ్చారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న చరణ్, ఈ విషయం తెలుసుకుని వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి సమయం గడిపారు.తనను చూసేందుకు ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులను చరణ్ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వారితో సరదాగా మాట్లాడటంతో పాటు ఫొటోలు కూడా దిగారు. అభిమానుల పట్ల ఆయన చూపిన ప్రేమ, గౌరవం, సింప్లిసిటీకి సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. చరణ్ తీరుపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.మరోవైపు రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం చిత్ర యూనిట్ త్వరలోనే ఢిల్లీకి వెళ్లనుంది. అక్కడ సినిమాకు అత్యంత కీలకమైన కొన్ని యాక్షన్, ఎమోషనల్ సన్నివేశాలను చిత్రీకరించడానికి దర్శకుడు బుచ్చిబాబు సాన భారీ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

# డాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జాని మాస్టర్ భార్య విజయం



తెలుగు ఫిల్మ్ డాన్సర్స్ అసోసియేషన్  అధ్యక్షురాలిగా ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అర్ధాంగి సుమలత గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఆమె తన సమీప ప్రత్యర్థి జోసెఫ్ ప్రకాశ్ మాస్టర్‌పై 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అసోసియేషన్‌లోని పలువురు సీనియర్, ప్రముఖ డాన్స్ మాస్టర్లు జోసెఫ్‌కు మద్దతుగా నిలిచినప్పటికీ, సుమలత ఒంటరిగా పోటీ చేసి గెలవడం పరిశ్రమలో చర్చనీయాంశమైంది.ఈ ఎన్నికల్లో మొత్తం 510 ఓట్లకు గాను 439 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు అనంతరం సుమలతకు 228 ఓట్లు, జోసెఫ్ ప్రకాశ్ మాస్టర్‌కు 199 ఓట్లు, మరో అభ్యర్థి చంద్రశేఖర్‌కు 11 ఓట్లు లభించాయి. దీంతో సుమలత అధ్యక్షురాలిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. శేఖర్ మాస్టర్, భాను మాస్టర్, రఘు మాస్టర్ వంటి పలువురు ప్రముఖ కొరియోగ్రాఫర్లు జోసెఫ్‌కు బహిరంగంగా మద్దతు తెలిపారు. నటి సృష్టి వర్మ సైతం జోసెఫ్ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు.

అయితే, డాన్సర్లలో ఎక్కువ మంది సుమలత వైపే మొగ్గు చూపారు. గతంలో తాను పోటీ చేస్తే అనవసర వివాదాలు, అడ్డంకులు సృష్టిస్తారనే ఉద్దేశంతో జానీ మాస్టర్ ఈసారి తన అర్ధాంగి సుమలతను అధ్యక్ష బరిలో నిలిపినట్లు ప్రచారం జరిగింది. సీనియర్లంతా ఒకవైపు ఉన్నా, ఎలాంటి గ్రూపుల మద్దతు లేకుండా సుమలత సాధించిన ఈ విజయం అసోసియేషన్‌లో కొత్త మార్పులకు సంకేతమని పలువురు భావిస్తున్నారు.

# ప్రపంచాన్ని చుట్టేయండి

## : స్ఫూర్తిదాయక సందేశంతో రష్మిక కొత్త ఫొటోలు



ప్రముఖ నటి రష్మిక మందన్న తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులకు తన తాజా ట్రిప్ విశేషాలను పంచుకున్నారు. అందమైన ఫోటోలతో పాటు జీవితంపై స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. తెల్లటి దుస్తులు ధరించి, తలలో తెల్లటి పువ్వు పెట్టుకున్న ఫొటోలను షేర్ చేస్తూ రష్మిక ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ రాశారు. "ప్రపంచాన్ని చుట్టేయండి. అన్వేషించండి. తప్పులు చేయండి, మిమ్మల్ని మీరు క్షమించుకోండి. ప్రేమించండి. బిగ్గరగా నవ్వండి. సంతోషంగా జీవించండి. మీ జీవితాన్ని, ఇతరులను, మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. దయతో ఉండండి" అంటూ తన ఫ్యాన్స్‌కు స్ఫూర్తినిచ్చారు.ఇటీవల రష్మిక నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రశంసలు కురిపించారు. సినిమాలోని ఒక కీలక సన్నివేశాన్ని షేర్ చేస్తూ "తప్పక చూడాల్సిన సినిమా" అని పేర్కొన్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ రొమాంటిక్ డ్రామాలో రష్మిక నటనకు విమర్శకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి.   రష్మిక అప్పుడప్పుడు తన పోస్టులతో అభిమానులను ఆలోచింపజేస్తుంటారు. కొన్ని రోజుల క్రితం 'ఫెమినిన్ ఎనర్జీ' గురించి ఆమె చేసిన పోస్ట్ కూడా బాగా వైరల్ అయింది. మహిళలు ఒకరికొకరు తోడుగా నిలిస్తే అద్భుతాలు చేయగలరని, వారి శక్తి అన్‌స్టాపబుల్ అని ఆమె ఆ పోస్టులో అభిప్రాయపడ్డారు.